# ఎంతెంత దూరం?

**- బలభద్రపాత్రుని రమణి**

''అదిగో మెట్ల దారి. తిన్నగా పొండి'' అన్నాడు టాక్సీ డ్రైవర్. నేనూ శ్రీనాథ్ టాక్సీ దిగాం. అత్తయ్య మామయ్య లోపలే ఉన్నారు. శ్రీనాథ్ నావైపు మిర్రి మిర్రి చూస్తూ వాటర్ బాటిల్ అందించాడు.

బాటిల్ అందుకుని టాక్సీలోకి తొంగి చూస్తూ ''వెళ్లొస్తాం అత్తయ్యా. పైన కలుసుకుందాం'' అన్నాను అత్తయ్యతో. తిరుపతి కొండ సర్వాంగ సుందరంగా పిలుస్తోంది.

మామయ్య తల బైట పెట్టి ''ఒరేయ్ మొద్దూ! ఆగి అలుపు తీర్చుకుంటూ నడవాలి. అది అసలే కొత్త పెళ్లికూతురు'' అన్నాడు.

శ్రీనాథ్ కోపంగా ''ఆ...అలాగే. రేపీపాటికి జేరితే గొప్పే'' అన్నాడు.

''నిండా ఓపికతో నడిస్తే నాలుగు లేదా అంజి గంట పట్టుద్ది సార్'' అన్నాడు టాక్సీ డ్రైవర్.

నేనూ మామయ్యతో ''అలాగే ఆగి ఆగి వెళ్తాంలే మామయ్యా'' అన్నాను.

మామయ్య తృప్తిగా చూసి డ్రైవర్‌తో ''పోనీవోయ్'' అన్నాడు.

టాక్సీ కదులుతుంటే ''భద్రంరా అబ్బాయ్. జాగ్రత్త తల్లీ'' అన్న అత్తయ్య కేకలు మాకు వినిపించసాగాయి.

చీర కుచ్చెళ్లు పైకి కాస్తంత ఎత్తి పట్టుకుని శ్రీనాథ్ వెంట నడిచాను. పారాణి ఆరని పచ్చని పాదాలకి కొత్తగా వచ్చి చేరిన మట్టెల అలంకారం వింతగా అనిపించింది. మొదటి మెట్టు ఎక్కుతుంటే గుండెలమీద గలగలలాడాయి మంగళసూత్రాలు. అరచేత్తో అదిమిపట్టి అలవోకగా తల తిప్పి అతనివైపు చూసాను.

అతను భుజంమీద టవల్ వేసుకుని మొహం గంటు పెట్టుకుని నడుస్తున్నాడు.

''బావకి ఇవన్నీ నచ్చుతాయా? ఏడుకొండలు నడిచి ఎక్కగలడా అత్తయ్యా?'' అని నేనంటే ''అపచారం... అపచారం. మొక్కే తల్లీ. పసుపు బట్టలతో కొడుకునీ కూతురునీ కొండకి నడిపిస్తానని నేనూ మీ మామయ్యా మొక్కుకున్నాం'' అంది అత్తయ్య.

ఎంత పౌడర్ రాసినా అతని బుగ్గమీద చుక్క మబ్బులచాటు చంద్రునిలా కనిపిస్తూనే వుంది. లీలగా కనిపిస్తున్న పారాణితో పాదాలు కనపడకూడదన్నట్లు గబగబా నడుస్తున్నాడు.

నేను హుషారుగా పది మెట్లు ఎక్కేసరికి ఆయాసం వచ్చింది. మాట రావడం కష్టమైపోయింది.

''కాసేపు కూచుందాం'' అంటూ మెట్టుమీద కూలబడ్డాను.

అతను నాకు కాస్త దూరంలో కూర్చుని జేబులోంచి సిగరెట్ తీసాడు.

''ఆ...ఆహా'' చెంపలు వేసుకుంటూ వారించాను. వద్దు...తప్పు అనడానికి ఆయాసంలో మాట రాలేదు.

అతను విసుగ్గా చూసాడు. మొహంమీద పడుతున్న జుట్టు చిరాగ్గా వెనక్కి తీసుకున్నాడు.

'ఆ చిరాకే లేకపోతే ఎంత బావుంటాడు? అచ్చం బావ సినిమా హీరోలా వుంటాడు' అనుకున్నాను.

''యా ఊరు తల్లే...కొత్తగా పెళ్లయిందా?'' అని ఓ ముసలవ్వ పలకరించింది.

నేను నవ్వుతూ తల వూపి ఊరుకున్నాను.

వాళ్లు దూరంగా కూర్చున్న శ్రీనాథ్‌ని వింతగా చూస్తూ ''గోవిందా అని నడుస్తే అంటే అలుపొచ్చే పనిబడ్డా'' అని మమ్మల్ని దాటి ముందుకి సాగిపోయారు.

నేను లేచి అతని దగ్గరగా వెళ్లాను.

''వెళ్దామా?'' అడిగాడు.

నేను జవాబు చెప్పకుండా అతని పక్కన కూర్చున్నాను.

శ్రీనాథ్ ఠక్కున లేచి పద అన్నాడు.

నేను నిరుత్సాహంగా చూసాను.

అతను పెద్ద పెద్ద అంగలేస్తూ వెళ్లిపోతున్నాడు.

నేనూ మెట్లు ఎక్కుతూ స్తంభం చాటున దాక్కున్నట్లుగా కూర్చున్న ఓ ఇంటిని చూసాను. అమ్మాయి నోటికి తేగలు వొలిచి అందిస్తున్నాడు అబ్బాయి. ఆ అమ్మాయి అతని తొడమీద మోచేతిని ఆన్చి గెడ్డం క్రింద అరచేతిని చేర్చి కిలకిలా నవ్వుతూ తింటోంది. ఆమె మెడలో వున్న లావాటి పసుపుతాడు మాలాగే కొత్తగా పెళ్లయిన వాళ్లని చెబుతోంది.

నేను ఉస్సూరని నిట్టూర్చి కదిలాను. ఆయాసం గుండెకి ఎగదన్నోంది. అడుగు ముందుకి సాగక రెయిలింగ్ పట్టుకుని అలాగే నిలబడిపోయాను.

నేను రావడం లేదన్న విషయం శ్రీనాథ్ కాసేపటికి తెలుసుకున్నాడు. నిలబడి రా అన్నాడు.

నేను తల అడ్డంగా ఆపి కింద కూర్చుండిపోయాను. ఇంక నావల్ల కాదనిపించింది.

అతనే నాలుగు మెట్లు దిగి వచ్చి ''మంచినీళ్లు త్రాగుతావా?'' అన్నాడు.

నేను ఆయాసంతో మాట్లాడలేక తల వూపాను.

అతను మంచినీళ్లు అందించాడు. ''నెమ్మదిగా సిప్ చెయ్యి. గటగటా త్రాగకు'' అన్నాడు.

నాకు ప్రాణం పోతోందేమో అనిపించింది. రొప్పుతూ నీళ్లు త్రాగాను.

అతను దూరంగా కొండలమీంచి ఉరుకుతున్న నీటిధారలనూ, తల ఎత్తుకుని ధాటిగా నిలబడ్డ పర్వత పంక్తులన్నీ చూస్తున్నాడు.

నాకు కాస్త ఆయాసం తగ్గింది.

కొత్తగా పెళ్లయిన జంట మా ముందునుంచీ నవ్వుతూ వెళ్తున్నారు. అతను ఆమె మోకాళ్ల క్రింద చెయ్యివేసి అమాంతం పైకి లేపి రెండు మెట్లు ఎక్కాడు. ఆమె వదిలించుకుని దిగిపోయింది. అతనూ ఆమే చుట్టూ వున్నవారు అందరూ నవ్వుతున్నారు. ఎంత ఆనందంగా వున్నారు?

''సారీ బావా'' అన్నాను అతనివైపు చూస్తూ.

అతను ఉలిక్కిపడి ''ఎందుకూ?'' అన్నాడు.

''అలాంటి సంతోషం నువ్వు మిస్ అయినందుకు'' అన్నాను.

అతను అర్థం కానట్లుగా నా కళ్లల్లోకి చూసాడు.

''శైలజని పెళ్లి చేసుకుని వుంటే నువ్వు అంత హేపీగా వుండేవాడివిగా? ఇష్టం లేకపోయినా పెద్దవాళ్ల మాటకోసం నా మెడలో తాళి కట్టావు పాపం'' అన్నాను.

''దెప్పిపొడుస్తున్నావా?'' కోపంగా అడిగాడు.

''కాదు... అర్థం చేసుకుని అంటున్నాను. అమ్మతో చెప్పాను. బావ ఇష్టపడిన అమ్మాయినే చేసుకోనివ్వండి. బలవంతంగా నన్ను అంటగట్టవద్దు అని అన్నయ్య నాకు మాటిచ్చాడు. మా పుట్టింటివాళ్లు మాట తప్పరు



అంటూ మొండిగా ఈ పెళ్లి చేసింది'' అంటూ వుంటే నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

''సర్లే. ఇప్పుడివన్నీ ఎందుకు?'' అన్నాడు టవల్‌తో మొహం తుడుచుకుంటూ.

''మ్మావిడి పెచ్చులమ్మా... మావిడి పెచ్చులు. దాహం కాకుండా కాపాడుద్ది'' తమాషాగా కత్తిరించిన కలెక్టర్ మావిడి కాయలు తెచ్చాడొకతను.

''తింటావా?'' అడిగాడు శ్రీనాథ్.

నేను వద్దన్నాను.

మళ్లీ లేచి ఎక్కడం ప్రారంభించాం.

దూరం నుండి మంత్రపుష్పం వినిపిస్తోంది. కాలు విరిగిన కోతి ఒకటి పళ్లన్నీ బైటపెట్టి మమ్మల్ని వెక్కిరించింది. అప్రయత్నంగా నేను అతని చెయ్యి అందుకున్నాను. భయం వేసింది.

అతను ''ఉష్...ష్'' అని దానిని తోలేసాడు. ఆ తర్వాత నెమ్మదిగా నా చేతిని విడిపించుకుని ముందుకి కదిలాడు.

మెట్లపక్కన ఆంజనేయస్వామి తోక ఎత్తి నిలబడి ఠీవిగా దర్శనం ఇచ్చాడు.

భక్తిగా నమస్కరించి ''ఈ ప్రయాణం ఈ మనిషితో ఇప్పుడే మొదలుపెట్టాను. కడదాకా సజావుగా సాగనీ స్వామీ'' అని ప్రార్థించాను.

''ఇడ్లీ...వడా...దోశా, ఫ్రూట్...స్ట్రాంగ్ నేస్‌కాఫీ సర్'' అంటూ అటూ ఇటూ వున్న దుకాణాలవాళ్లు అడ్డం పడ్డారు.

అతను ఆగి నాతో ''కాఫీ తాగుతావా?'' అని అడిగాడు.

కమ్మని కాఫీ వాసన వ్యామోహపరుస్తుంటే కాదనలేకపోయాడు.

ఇద్దరం చెట్టు క్రింద వేసిన కుర్చీల్లో కూర్చున్నాం. షాపతను కాఫీ అంతెత్తు నుండీ క్రింద చిందకుండా చల్లారపోస్తుంటే ఆశ్చర్యంగా చూస్తూ కూర్చున్నాం.

శ్రీనాథ్ టవల్‌తో ముఖం తుడుచుకుంటూ ''ముందర ముందర కష్టంగానే వుంటుందిట. తర్వాత అలవాటైపోతుందిట'' అన్నాడు.

''దేని గురించి మాట్లాడుతున్నావు బావా? కొండెక్కడం గురించా లేక జీవితం గురించా?''

ఈసారి కాస్త సంభ్రమంగా చూసాడు.

''నువ్వెంతదాకా చదువుకున్నావు గాయత్రీ?'' అన్నాడు.

నాకు నవ్వొచ్చింది. న్యాయంగా పెళ్లి చూపుల్లో అడగాల్సిన ప్రశ్న అతను ఇప్పుడు అడుగుతున్నాడు.

''నువ్వు ప్రేమించిన అమ్మాయికిలా బోలెడంతేం కాదులే. ఏదో రుక్మిణీ కళ్యాణం తప్పులు లేకుండా చదివేటంతా. చాకలి పద్దులు రాసేటంత'' అన్నాను.

అతనికి నా గురించేమీ తెలియదుట పాపం. ఈ రాష్ట్రంలో పెరగలేదు.

''అలా అనిపించడంలేదు'' అన్నాడు.

''ఎలా అనిపిస్తున్నాను?'' అల్లరిగా అడిగాను.

గాలికి మొహంమీద పడుతున్న ముంగురులని సరి చేసుకుంటూ వుంటే నా నుదుటిమీద కుంకుమ చెదిరినట్లుంది.

''ఆగు...'' అంటూ అతను టవల్‌తో సరి చేసాడు. ఆ వేళ్ల స్పర్శకి నా గుండె ఝల్లుమంది.

''కాఫీ తీసుకో'' అన్నాడు.

నేను కాఫీ గుటక వేస్తుంటే నన్నే చూస్తూ కూర్చున్నాడు. ఎందుకా అనుకుంటూ నావైపు చూసుకుంటే పైట పక్కకి తొలగి జాకెట్టు తొంగి చూస్తోంది. గబుక్కున ఒక చేత్తో సరి చేసుకున్నాను.

''నేను చూస్తున్నది వాటిని... సూత్రాల్ని'' అన్నాడు.

సూర్యుడి నీరెండకి అవి తళతళా మెరుస్తున్నాయి. ఆ మెరుపు అతని ముఖంమీద పడుతోంది.

''అబ్బో... సూర్యమండలం అంత పైదాకా ఎక్కేసాం బావా! ఇదిగో సూర్యబింబం చేతికి అందుతోంది. ఎంత ఎర్రగా వుందో?'' అన్నాను అతని ముఖంవైపు చేత్తో చూపిస్తూ.

''మంచి మాటకారివే?'' నవ్వాడు.

వేయి పున్నములు విరిసినట్లయింది. పెళ్లిపీటలు ఎక్కినప్పటి నుంచి ఇప్పటివరకూ బావ నవ్వలేదు. నా అంచనా తప్పలేదు. బావ నవ్వితే అతని అందం పెరుగుతోంది.

''శైలజ కూడా నీ అంత అందంగా వుంటుందా బావా?'' కాఫీ త్రాగుతూ అప్రయత్నంగా అడిగేసాను. అడిగాక అతని మూడ్ మారిపోతుందేమోనని కంగారుపడ్డాను.

బావ సీరియస్‌గా మారాడు. ''అందం కాదు గాయత్రీ... చిన్నప్పట్నుంచీ కలసి ఒకచోట పెరిగాం. చదువుకున్నాం. దాన్ని...దాన్ని...''

మాటల కోసం తడబడ్డాను. ''అనుబంధం అంటారు'' అన్నాను.

''ఎగ్జాక్ట్లీ! థాంక్స్'' అన్నాడు.

''కొత్త అంటే భయపడేవాళ్లు, కొత్తవాళ్లతో ఎలా వేగడం బాబూ అనుకునేవాళ్లు సామాన్యంగా ఇలా ఎప్పట్నుంచో తెలిసిన వాళ్లనే పెళ్లి చేసుకుంటారు బావా. అధిక ప్రసంగం అనుకోకు. మన పెద్దవాళ్లని చూడు. తెలిసిన కుటుంబం అయితే ఎంతైనా రిస్క్ తక్కువ అన్న ఆలోచన అన్నమాట. మీది ఈ రకమైన ఆలోచన కాకుండా ప్రేమైతే...'' అని ఆగిపోయింది.

''ఆ...అయితే?'' రెట్టించాడు.

''నువ్వు ఇలా నాతో ఇంతసేపు మాట్లాడేవాడివి కూడా కాదు బావా! ప్రేమించిన వాళ్లముందు తప్ప ఎవరిముందూ నోరిప్పబుద్ధి, నవ్వబుద్ధి కూడా కాదు. నాకెలా తెలుసనుకుంటున్నావా? ఇప్పుడిప్పుడే నిన్ను చూసాక తెలుస్తోంది?'' సిగ్గుగా తలొంచుకున్నాను.

అతనికి కాస్త కోపం వచ్చినట్లుంది. కాఫీ అతనికి డబ్బులిచ్చి ''ఊ...పద ఇంకా చాలా దూరం నడవాలి'' అన్నాడు.

చుక్కల పర్వతం ఎక్కుతుంటే చుక్కలు కనిపించాయి. మోకాళ్ల పర్వతం దగ్గర మోకాళ్లు పట్టేసాయి.

బావ తన ఆలోచనల్లో తనున్నట్లు గబగబా నడుస్తున్నాడు.

నేను అడుగు పడక ఆగిపోయాను.

''అమ్మీ...నా వీపు మీద సెయ్యేసి నడు. ఇంకా ఎంతో దూరంలేదు. గోవిందా...గోవిందా అనుకోవే పిచ్చిమొకమా ఆ సామే తీసుకెళ్తాడు'' అన్న మాటలకి పక్కకి తిరిగి చూసాను.

అరవై పైబడ్డ ముసలి జంట. భార్యని ఆయన జాగ్రత్తగా ఒక్కొక్క మెట్టే ఎక్కిస్తున్నాడు. తిరునామాలు, కాషాయ పంచలో వేంకటేశ్వరుడిలా కనిపించాడా అనిపించింది. ఆయన పక్కనే గోచీపోసి కట్టుకున్న పట్టుచీరలో వంగిన నడుముతో పెద్ద కుంకుమ బొట్టు, ముక్కున బేసరితో ఆయన భార్య. అచ్చం అలివేలు మంగమ్మలా!

చేతులు జోడించి వారి అన్యోన్యతని అబ్బురంగా చూసాను.

బావ చాలా దూరంగా కనిపిస్తున్నాడు. వాటర్ బాటిల్ చేయి మార్చుకుని అతి కష్టంగా అడుగు వేయసాగాను.

''ఇంక దగ్గరికి వచ్చేసాం. భయంలేదు. ఆగకుండా నడిస్తే అరగంట'' దిగుతున్న ఓ అమ్మాయి నా బాధ చూసి చెప్పింది. కాళ్లకన్నా నా మనసెక్కువగా లాగుతోంది. నాది కాని వస్తువుని నేనెందుకు కోరుకున్నాను. బావ ఆ అమ్మాయితో వచ్చివుంటే ఇలా వుండేవాడా? కిలకిలలాడుతూ ఎంత ఆనందంగా వుండాల్సినవాడు? మెడ క్రింద వెచ్చగా తగిలింది. ఆశ్చర్యం! నా కళ్లల్లోంచి కూడా జలధారలు. కళ్లు మసకలు కమ్మాయి. మొండిగా అడుగులేస్తున్నాను. శరీరం వశం తప్పుతోంది.

''అమ్మా...'' అని అరిచాను. ఆ తర్వాత అంతా చీకటిగా అనిపించింది.

''అయ్యో...అయ్యో. కొత్త పెళ్లికూతుర్లా వుంది. ఆ పెనిమిటి ఎక్కడ?'' అన్న జనం గొంతులు వినిపిస్తున్నాయి. నేను చివరగా విన్నది ''గోవిందా...ఏడుకొండలవాడా'' అన్న నామజపం.

★★★

కళ్లమీద జల్లున పడిన తడికి నెమ్మదిగా కళ్లు తెరిచాను.

బావ ఆత్రంగా నా ముఖంలోకి చూస్తూ ''గాయి...ఎలా ఉంది?'' అన్నాడు.

ఆ పిలుపుకి నా మేను పరవశించింది.

అప్పుడు చూసుకున్నాను. నేను అతని వళ్లో వున్నాను. ఎంత సుఖంగా వుంది. నాకు లేవాలనిపించలేదు.

''నా గుండె జారిపోయింది తెల్సా?'' నా అరచేతిలో ముద్దుపెడ్తూ అన్నాడు.

నేను తృప్తి నిండిన కళ్లతో ఆనందంగా చూసాను.

''ఎత్తుకు తీసుకెళ్లనా? ఎంతో దూరంలేదు'' లాలనగా అన్నాడు.

''ఇంకెంత దూరం అయినా బాధలేదు బావా. చకచకా నడవగలను'' కన్నీళ్లతో చెప్పాను.

నా కన్నీళ్లు తుడుస్తూ ''గాయి! ఐ లవ్ యూ'' అన్నాడు.

అతని కళ్లల్లో కూడా ఎందుకో తడి!

అతని చేతిని చెంపకి ఆన్చుకుని చెప్పాను ''కలిసి ప్రయాణం చేస్తుంటే అనుబంధం గట్టిపడి ప్రేమగా మారుతుంది బావా. ప్రేమంటే నేను బాధపడితే నీకు కలిగే నొప్పి''

అతను బుంగమూతి పెట్టి ''గాయి! నిజం చెప్పు. నువ్వేం చదువుకున్నావు?'' అన్నాడు.

''మీ మనసుని'' అల్లరిగా నవ్వాను.

సైకాలజీలో పీజీ చేసిన నేను బావకి ఇష్టం లేకుండా ఈ పెళ్లి ఎలా చేసుకోను అని దిగులు పడినప్పుడు ''కలసి నాలుగు రోజులు కాపురం చేస్తే బంగారంలో రాగిలా కలిసిపోతారమ్మా ఆలుమగలు. అదే పైవాడి మాయ'' అని నాకు నచ్చచెప్పిన బామ్మ ఏం చదువుకుందీ?

నా నడుము దగ్గర పట్టుకుని పైకి లేపి అల్లరిగా నవ్వుతున్న బావతో కలసి అడుగులేస్తుంటే తిరుమల కొండ ఇంకా దూరం పెరిగితే బావుణ్ణు అనిపించింది!

★



## పాపం శిల్పా శిరోద్కర్

పాపం ఆదేం చిత్రమోగానీ మొదట్నుంచీ శిల్పా శిరోద్కర్ ఎంత లావు తగ్గుదామని ప్రయత్నించినా కుదరడంలేదు సరికదా, ఇంకా ఇంకా లావు అయిపోతూనే వుంది. ఈ లావు కారణంగానే ఆమె కెరీర్ నత్త నడక సాగుతోంది. అందచందాలు బాగానే వున్నాయి, ఎక్స్‌పోజింగ్‌కి మొహమాటాలు లేవు. కానీ 'అమ్మో! శిల్పా మరీ లావు బాబోయ్! హీరోయిన్‌గా ఆమె ఏం బాగుంటుంది' అని పెదవి విరిచేసే వాళ్లు ఎక్కువైపోతున్నారని బోలెడన్ని వ్యాయామాలు, డైటింగ్‌లు మొదలెట్టింది శిల్పా. జిమ్‌కి వెళ్లి ఎక్సర్‌సైజులూ గట్రాలూ చేయడంలో అక్కడ కాస్త జారిపడి కాలు కాస్త ఫ్రాక్చరయి కూర్చుంటుందిట ఇప్పుడు. సినిమా చాన్స్‌ల మాట తర్వాత ఇప్పుడు ఇంట్లో కొంత కాలం రెస్టు తీసుకునే పరిస్థితి ఏర్పడిందిట. ప్చ్!

-జి.ఎం.